# చేతికర్ర

ఆ రోజు ఆఫీసంతా హడావిడిగా ఉంది. సీనియర్ ఉద్యోగి రంగనాథ రిటైరైన సందర్భంలో వీడ్కోలు సభ జరుగుతోంది. ఎగుమతి దిగుమతుల వ్యాపారంలో పేరు పొందిన ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టరుతో, రంగనాథం వేదికపైదికి వచ్చి పుష్పమాలా లంకృతుడు కాగానే సభికులు చప్పట్లు కొట్టారు. ముందు వరసలో కూర్చున్న సెక్షన్ ఆఫీసర్ గోవిందరావు మాత్రం ఆ ఆనందంలో పాలు పంచుకోలేకపోయాడు. కళ్ళజోడు చేతిలోకి తీసుకుని, అద్దాలు పంచెతో తుడుస్తూ అతనేదో ఆలోచిస్తున్నాడు. పక్కనున్న ఉద్యోగి గోవిందరావు చెవిదగ్గర పెదవి విప్పి "మీకూ ఆయనకీ పడదా ఏం?" అన్నాడు. గోవిందరావు ఆశ్చర్యపడి "అదేమిటి. మేమిద్దరము పరమ మిత్రులం" అన్నాడు. "చప్పట్లు కొట్టక పోతే అసిగాస్లెండి." అని ఆ ఉద్యోగి మళ్ళీ దూరంగా జరిగాడు. తన పొరపాటు తెలుసుకొని గోవిందరావు నెమ్మదిగా చేతులు కలిపాడు. కళ్ళజోడు తీసుకోబోతుంటే పక్కనే ఉన్న ఉద్యోగి వారించి "పెద్ద వారు నేను తీసానుండండి." అని తన సహాయాన్ని అందజేశాడు. అతనామాటలు గౌరవపూర్వకంగా, నమ్రతగా అనలేదనటానికి ఆధారంలేదు. కాని గోవిందరావుకేదో అసంతృప్తి కలిగింది.

రంగనాథం సేవల్ని ఉగ్గడిస్తూ, శక్తిసామర్థ్యాల్ని ప్రశంసిస్తూ వక్తలు మాట్లాడారు. తరవాత మేనేజింగ్ డైరెక్టర్ ప్రశంసావాక్యాలు పలికి, సభ్యుల కరతాళధ్వనులు చెలరేగుతుండగా రంగనాథానికి ఒక నక్కాటి పనిపూనేసిన చేతికర్ర బహూకరించారు. "అది తోకమీద నిలబడి పడగవిప్పిన పాములా ఉంది" అనుకొన్నాడు గోవిందరావు అనుకోగానే అతని గుండె గతుక్కుమంది.

రంగనాథం తగువిధంగా జవాబిచ్చాడు. డైరెక్టర్‌గారిచ్చిన చేతికర్ర తనకి ప్రాణప్రదమైందనీ, అది ఎప్పుడూ తనకి చేదోడుగా ఉంటుందనీ అన్నాడు. గోవిందరావు ఒళ్ళు మండింది. సిపాయిలా నిలబడ్డ ఆ తుపాకిలాంటి మనిషికి చేతికర్ర అవసరమేమిటి?

సభముగిసింది. గోవిందరావు ఇంటికి మళ్ళాడు. అతనిలో అశాంతి రేగింది. ఇవాళ రంగనాథం రిటైరయాడు. వచ్చేనెలాఖరికి గోవిందరావు కాళ్ళువణికాయి. కొంతంత భవిష్యత్తుని అద్దంలో చూసినట్టయింది.

ఆ రాత్రి గోవిందరావుకి కలతనిద్రతోనే తెల్లవారింది. తెల్లవారింతర్వాత కూడా అవే ఆలోచనలు.

పదిగంటలకి ఆఫీసులో అడుగు పెడుతున్న గోవిందరావుకి తననిగురించి తోటి ఉద్యోగులు అనుకుంటున్న మాటలు వినిపించాయి.

"తర్వాత వంతు ఎవరి దండీ?"

"సెక్షన్ ఆఫీసర్ గోవిందరావు."

"ఆయనకి అంతవయసుందా?"

"లేకేం అండీ?"

"అలా కనిపించదు సుమండీ."

"పెళ్ళికళ అనేది ఉన్నట్టు, రిటైరు

---

హితశ్రీ

---

మెంట్ కళ అనేది ఓటుంటుందండీ. వచ్చే మార్చిలో చూడండి గోవిందరావుని. ఏమీ తెలియని వాడుకూడా ఫిఫ్టీఫైవ్ అంటాడు"

"నిజమే, రంగనాథం సినిమా హీరోలా ఉండేవాడు. నిన్న చూడండి, ఆ పీక్కుపోయినముఖం, గుంటలుపడ్డ కళ్ళు, సీరు కావిపట్టిన పండ్లపీలికల్లాంటి జుట్టూ, మలేరియారోగి టెంపరేచర్‌లా వయసు యాభై అయిదుకి షూటప్ అయిందండీ. ఓవర్ నైట్."

"అంతేనండి. గోవిందరావు తర్వాత ఎవరు?"

బకాసురుడికి దగ్గిరికి వర్నాడు వెళ్ళాలిసిన దౌర్భాగ్యుడెవరో తెలుస్తున్నట్లుంది వాళ్ళ సంభాషణ వైఖరి. ప్రస్తుతం తన వంతేనని తలుచుకుంటూ ఖిన్నుడైనాడు గోవిందరావు. పరాకుగా అడుగులు వేస్తూ వస్తున్న అతనిని చూడగానే "ఏమండోయ్, గోవిందరావుగారు, ఈ కఠిన నరకంనించి విముక్తులయేనెక్స్ట్‌ఛాన్సుమీదే. కంగ్రాట్సు" అని ధోరణి మార్చాడొక ఉద్యోగి.

గోవిందరావు ముభావంగా ఊరుకున్నాడు. అతని బుర్ర వేడెక్కింది. ఒక భావావేశంతో మేనేజింగ్ డైరెక్టర్ రూమ్‌లోకి వెళ్ళాడు. "సార్, నాకు రెండు సంవత్సరాలు ఎక్స్‌టెన్‌షన్ ఇవ్వటానికి వీలుంటుందా?" అన్నాడు.

"మీరు రిటైరు కావలసిన తేదీ ఏది?" అన్నాడు అధికారి.

"వచ్చే మార్చినెల."

"మరి ఇప్పుడే ఎక్స్‌టెన్షన్ ప్రసక్తి ఎందుకు?"

"గోవిందరావు సందిగ్ధంలో పడ్డాడు."

"ముందు కార్యక్రమం నిర్ణయించుకోవాలి గదండీ"

"మిస్టర్ గోవిందరావ్, రంగనాథంగారు కూడా ఎక్స్‌టెన్షన్ అడిగారు కాని ఇవ్వలేకపోయాము. ప్రమోషన్ రావలసిన యువకుల్ని నిరుత్సాహ పరచటం మంచి పద్ధతి కాదు. ఎవరికీ ఎక్స్‌టెన్షన్స్ ఇవ్వకూడదని బోర్డు నిర్ణయించింది ఆఫీసుకి యంగ్ బ్లడ్ కావాలండీ. యంగ్‌బ్లడ్. మరేమనుకోకండి."

స్పష్టంగా చెప్పేశాడాయన. గోవిందరావుకి ఉన్న కాస్త ఉత్సాహం నశించింది. నిరాశ ముఖంలో తాండవించింది.

"అంతేనా!" అన్నాడు.

"మీరిప్పుడే దిలహీనంగా కని

పీస్తున్నారు. ప్లీజ్ మంచి టానిక్ తీసుకోండి, విశ్రాంతి అవసరం. సెలవు కావాలంటే మంజూరుచేస్తాను "

హార్దికంగా కాకపోయినా ఆర్ద్రంగా అన్నాడు అధికారి.

"థాంక్స్" అని గోవిందరావు చరచర వెళ్ళిపోయాడు.

సాయంత్రం ఆఫీసు మూసివెయ్యగానే ఇంటికి బయలేరిన గోవిందరావుకి ఎదురుగా వస్తున్న రంగనాథం కనిపించాడు. ఆశ్చర్యంగా అతనివైపు పరకాయించి చూశాడు. చేతిలో చేతికర్ర ఉంది. మామూలుగా నిటారుగా నడిచే రంగనాథం ఆసాయంకాలం కొంచెం వంగి నడుస్తున్నట్టుగా అతనికి తోచింది. అతను నల్లగా ఉంటాడు. కాని ఆ నలుపులో పూర్వం నిగనిగ ఉండేది. ఇప్పుడతని ముఖం ముఖ్యమైన పదార్ధాలు తీసేసిన మామూలు బొగ్గులా ఉందనిపించింది గోవిందరావుకి. అదే కాబోలు పించను కళ! గోవిందరావు వదనంమీద స్వేదబిందువులు పొరాయి. జేబురుమాలుతో తుడుచుకోటంకూడా అతను మర్చిపోయాడు.

"ఆఫీసునించేనా?" అని భుజంమీద తట్టి రంగనాథం అడిగేదాకా అతనీ ప్రపంచంలోనే లేడు.

"అవును." తేరుకుని ఎలాగో సమాధానమిచ్చాడు. "ఏమీ తోచటంలేదోయ్. ఒక్కరోజు గడిచేసరికే యుగం గడిచినట్టుంది. నువ్వుకూడా రిటైరైతే ఇద్దరం సరదాగా కాలం గడపొచ్చు."

"నేనా?"

"అలా ఉలిక్కిపడతావేం? నువ్వు రిటైర్ కాదలచుకోలేదా ఏం?" నవ్వుతూ అన్నాడు రంగనాథం. లేనినవ్వు తెచ్చుకున్నాడు గోవిందరావు. "మన చేతుల్లో ఏముంది? ఇదిగో నా చేతిలో ఇది ఉంది." అని నవ్వుతూ చేతికర్ర ఝళిపించాడు రంగనాథం. అలా ఝళిపించినప్పుడు ఒంటికాలిపై నిలబడి, గోవిందరావుని ఆసరాగా పట్టుకుని గిర్రున తిరిగాడు. ఆ ఊపుకి నిలతొక్కుకోలేక గోవిందరావు పడబోతూ చేతికర్రమీద కాలు వేశాడు. అది పెళ్ళుమంది.

రంగనాథం చిన్నబోయాడు. గోవిందరావుకి తెలియని సంతోషమేదో కలిగింది.

"సారీ" అన్నాడు పైకి.

"పరవాలేదు. కాని ఈసంగతి ఆఫీసులో చెప్పకు. డైరక్టర్ బాధపడతాడు." అన్నాడు రంగనాథం కొంత విచారంవ్యక్తం చేస్తూ.

"అలాగే."

రంగనాథం విరిగిన చేతికర్రని రోడ్డువారగా ఉన్న గుంటలో పారవేశాడు.

"తర్వాత కలుద్దాం."

ఇద్దరూ విడిపోయారు. ఆ గుంట పరీక్షిన్మహారాజు యాగశాలలోని సర్ప గుండం అనిపించింది గోవిందరావుకి. అకస్మాత్తుగా ఏనుగంత సత్తువ, లేడిపిల్ల చురుకుదనం లభించినట్లయి గోవిందరావు త్వరత్వరగా ఇంటివైపు నడిచి వెళ్ళాడు.

మర్నాటినించి గోవిందరావు పూర్తిగా మారిపోయాడు. పూర్వంకంటె ఇబ్బడి శక్తి సామర్ధ్యాలతో పనిచేయసాగాడు. ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ, అందరితో హుషారుగా మాట్లాడుతూ మెలగటం ప్రారంభించాడు. మొదటినించి అతను సమర్ధుడైన ఉద్యోగి అనేపేరు గడించుకున్నాడు. ఈ మధ్య ఏర్పడిన అలసత్వం తొలగిపోయింది. అతనిలోని నూత్నోత్సాహానికి కారణం ఎవరూ కనిపెట్టలేక పోయారు. తలొకవిధంగా కారణాన్ని ఊహించుకోసాగారు. "పాపం ఎక్స్‌టెన్షన్ కోసం అవస్థపడుతున్నాడు." అనేది సర్వులకూ ఆమోదకరమైన అంశం.

ఉన్నట్టుండి పిడుగు పడ్డట్టయింది. ఒక నెలరోజులు తన కొత్త హోదాతో చురుకుదనంతో ఆఫీసుని పునరుజ్జీవింపజేసి, అనాటి ఉదయం ఉద్యోగులందర్నీ గోవిందరావు విస్మయంలో ముంచివేశాడు. పదిగంటలకల్లా ఆఫీసుకి వచ్చిన గోవిందరావు తన సీటులో కూర్చోగానే ప్యూన్‌ద్వారా మేనేజింగ్ డైరెక్టర్‌కి ఒక కవరు పంపాడు. ఆ తర్వాత అప్పుడే తమ తమ స్థానాల్ని ఆక్రమించుకుంటున్న సహోద్యోగులవైపు తిరిగి ఒక నమస్కారం పెట్టి "ఇవాళ నేను మీ అందరిదగ్గర సెలవు తీసుకుంటున్నాను" అన్నాడు.

ఒక క్షణం నిశ్శబ్దం ఆవరించింది. అందరూ అతనివైపు ఆశ్చర్యంగా చూస్తూ చెవులు రిక్కించారు. "నేను రాజీనామా చేశాను." అన్నాడు గోవిందరావు కంచు గంట లాంటి స్వరంతో.

"రాజీనామా!" అన్నారు ఉద్యోగులు అపనమ్మకంతో.

ఇక గోవిందరావు మాట్లాడలేదు. కారణం అడిగే స్థితిలో ఎవరూ లేరు. ఇంతలో మేనేజింగ్ డైరెక్టర్ దగ్గిర్నించి పిలుపు వచ్చి గోవిందరావు వాళ్ళని వదిలి వెళ్ళాడు.

"నమస్కారం సార్."

మేనేజింగ్ డైరెక్టర్ అతని కళ్ళలోకి చూశాడు అతని నేత్రాలు పూర్వంలా వెలవెల బోతూ జాలి గొల్పటంలేదు. చీకట్లో వెలిగే కారు హెడ్‌లైట్లలా ఉన్నాయి.

"రాజీనామా ఎందుకు చేస్తున్నట్టు?"

"కేవలము వ్యక్తిగత కారణం పురస్కరించుకుని."

"మరికొన్ని నెలల్లో రిటైర్ కాబోతున్నారుగదా!"

"నేను రిటైర్ కాను."

"మరేదైనా పెద్దఉద్యోగం దొరికిందా?"

"లేదు. ప్రయత్నం చెయ్యలేదు."

అధికారికి ఏమనటానికి తోచలేదు. "గోవిందరావుగారూ, ఈ కంపెనీకి మీరు ఎన్నో సంవత్సరాలు ఎంతో సేవచేశారు. అది కంపెనీ మర్చిపోదు. మీకు ఎక్స్‌టెన్షన్ రావటానికి నా శాయశక్తుల ప్రయత్నిస్తాను. కోపంతో రాజీనామాచేస్తే నష్టమే గాని లాభమేమీ లేదు." అన్నాడు. గోవిందరావు తొణకలేదు.

"క్షమించండి. కంపెనీ ప్రాణంలేని సైన్‌బోర్డు. నేను కోపంతో రాజీనామా చెయ్యటంలేదు. అది నా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన నిర్ణయం. సెలవు."

దృఢంగా అన్నాడు గోవిందరావు. మేనేజింగ్ డైరెక్టర్ ముఖం ముకుళించింది. ఈ రాజీనామావల్ల కంపెనీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని అతను భావించాడు. కాని గోవిందరావు దృఢవైఖరికి అతను లొంగక తప్పలేదు.

గోవిందరావు రాజీనామా అంగీకరించబడిందనే వార్త ఆఫీసంతా క్షణంలో కస్తూరిలా గుప్పుమంది.

"పాపం బెదిరించాలని చూశాడు, బెడిసి కొట్టింది."

"కాదు. ఎక్స్‌టెన్షన్ ఇస్తామన్నా వద్దన్నాడట."

"కాకమ్మ కబుర్లు చెప్పకు."

"ఎందుకు రాజీనామా చేసినట్టు ?"

"లోగుట్టు పెరుమాళ్ళ కెరుక."

"ఎక్కడో మంచి ఉద్యోగం వారికి ఉంటుందిలే."

"మేరేజ్ ప్రపోజల్ ఉందని నా ఐడియా."

"ఎవరికి ?"


"వాళ్ళ పెద్దబ్బాయి మెడిసిన్ చదువుతున్నాడు. అతనికి డైరెక్టరుగారమ్మాయిని ఇవ్వాలనుకున్నారట."

"ఐసీ. వియ్యంకుడు తక్కువ హోదాలో ఉండకూడదని రాజీనామా చేశాడా ?"

"ఐ తింక్ సో."

ఇలా రకరకాలుగా గోవిందరావు రాజీనామా గురించి ఉద్యోగులు వ్యాఖ్యానాలు చేశారు, గోవిందరావుతో దోస్తీ ఉన్న ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు కారణం అడిగినా, అతను నవ్వుతూ "ఏంలేదు. ప్రైవేట్ రీజన్స్" అనటంకంటే మరేమీ చెప్పలేదు.

అందరి దగ్గరా సెలవు తీసుకుని గోవిందరావు ఆఫీసునించీ బయట పడ్డాడు. ఏదో స్వేచ్ఛ లభించినట్టు ఆనందంగా ఉందతనికి. ఆఫీసు భవనంవైపు చూశాడు. వోల్టేజి డ్రాప్ అయి కళా విహీనంగా వెలుగుతున్న దీపంలా, మెరుగు తగ్గిన అద్దంలా కనిపించింది. అతని పెదవులమీద చిరునవ్వు విరిసింది. ఆవరించిన అహంతో ముందడుగేశాడు. ఠీవిగా నడుస్తూ గోవిందరావు ఇల్లు చేరేసరికి "అప్పుడే వచ్చేశారేం ?" అని ఇల్లాలు ఆశ్చర్యం ప్రకటించింది.



"ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను." అన్నాడతను తాపీగా.

"రాజీనామా! ఏం జరిగిందండీ?" ఆత్రుత చెందిందామె.

"ఏం జరగలేదు. రాజీనామా చేశాను. అంతే."

"అదేమిటండీ? పెద్దవాడి మెడిసిన్ చదువు ఇంకో సంవత్సరముందాయె, చిన్నవాడి ఇంజనీరింగ్ రెండేళ్ళయితే కాని పూర్తికాదు. బి. ఎస్ సీ కాగానే అమ్మాయికి పెళ్ళి చేయాలనుకుంటున్నాం. మీరు ఆరు నెలలు ముందే రిటైరయి కూర్చుంటే ఎలా?" అని ఆమె ఆందోళన ప్రకటించింది.

"నేను రిటైర్ కాలేదు, రిజైన్ చేశాను అని చెప్పాను. వినబడ్డదా? నేను రిటైర్ కాను. ఉహుఁ – ఆ ప్రశ్నే నా జీవితంలో లేదు. అంతే."

తీక్షణంగా అంటూ రెండు మూడు మెట్లు ఒక్కసారే దాటుతూ మేడమీదికి వెళుతూ వెళ్ళిపోయాడు గోవిందరావు.

పైకి వెళ్ళగానే హోల్డాలు విప్పుతున్న పెద్ద కొడుకు శేఖరం కనిపించాడు.

"ఎప్పుడొచ్చావురా?" ఆశ్చర్యంగా అన్నాడు గోవిందరావు.

"ఇప్పుడే వస్తున్నాను." హోల్డాలు వదిలేసి "హైదరాబాద్‌లో మంచిరకం దొరుకుతాయని, నీకోసం దీనిని తెచ్చాను, నాన్నా." అంటూ శేఖరం గదిలోకి వెళ్ళాడు. కుతూహలంతో గోవిందరావు కూడా అతని వెనకే వెళ్ళి శేఖరం చేతిలో దేమిటో చూశాడు. గోవిందరావు ముఖం వెలవెల పోయింది.

"ఎలా ఉంది నాన్నా?" అంటూ శేఖరం వెనక్కి తిరిగి వచ్చాడు. అక్కడ గోవిందరావులేడు.

***

# చారు చికురసీమ సత్యభామ

(పోతన భాగవతంలో నరకాసుర వధ ఘట్టంనుంచి)

శా॥ వేణిం జొల్లెము వెట్టి సంఘటితనీవీ బంధయై భూషణ
శ్రేణిం దాల్చి ముఖేందుమండల మరీచీజాలముల్ పర్వఁగాఁ
బాణిం బయ్యెదఁ జక్కఁగాఁ దుఱిమి శుంభద్వీరసంరంభ యై
యేణీలోచన లేచి నిల్చెఁ దన ప్రాణేశాగ్ర భాగంబునన్.

క॥ హరిణాక్షికి హరి యొసఁగెను, సుర నికరోల్లాసనమును శూర కఠోరా
సుర సైన్య త్రాసనమును, బరగర్వ నిరాసనమును బాణాసనమున్.

శా॥ ఆ విల్లంది బలంబు నొంది తదగణ్యానంత తేజోవిశే
షావిర్భూత మహాప్రతాపమున వీరాలోక దుర్లోక యై
తా వేగన్ సగుణంబు చేసె ధనువుం దన్వంగి దైత్యాంగనా
గ్రీవాసంఘము నిర్గుణంబుగ రణక్రీడా మహోత్కంఠతోన్.

మ॥ వరుఁ జూచున్ వరుఁ జూచు నొంప నలరింపన్ రోష రాగోదయా
విరత భ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్
జరగన్ గన్నులఁ గెంపు సొంపు బొడఁగన్ జండప్ర సందోహమున్
సరసాలోక సమూహమున్ నెఱపుచున్ జంద్రాస్య హేలాగతిన్.

మ॥ అలినీలాలక చూడ నొప్పెసఁగెఁ బ్రత్యాలీఢ పాదంబుతో
నలికస్వేద వికీర్ణ కాలకలతో నాకర్ణ సంనీత స
ల్లలిత జ్యా నఖపుంఖ దీధితులతో లక్ష్యావలోకంబుతో
వలయాకార ధను ర్విముక్త విశిఖ వ్రాతాహతారాతి యై.

సీ॥ వీణెఁ జక్కఁగఁ బట్ట వెరవెఱుంగని కొమ్మ బాణాసనం బెట్లు పట్ట నేర్చె
బ్రాఁకున దీఁగెఁ గూర్పంగ నేరని లేమ గుణము నేక్రియ ధనుష్కోటిఁ
గూర్చె
సరము ముత్యము గ్రువ్వఁ జాలని యబల యే నిపుణత సంధించె
నిశితశరము
చిలుకకుఁ బద్యంబు చెప్ప నేరని తన్వి యస్త్రమంత్రము లెన్నఁ
డభ్యసించెఁ
ఆ॥ బలుకు మనినఁ బెక్కు పలుకని ముగుద యే గతి నొనర్చె సింహ
గర్జనములు
ననఁగ మెఱసెఁ ద్రిజగదభిరామ గుణధామ చారు చికురసీమ సత్యభామ.

శా॥ జ్యావల్లీ ధ్వని గర్జనంబుగ సురల్ సారంగ యూథంబుగా
నా విల్లింద్రశరాసనంబుగ సరోజాక్షుండు మేఘంబుగాఁ
దా విద్యుల్లతభంగి నింతి సురవి ద్దావాగ్ని మగ్నంబుగాఁ
బ్రావృట్కాలము సేసె బాణచయ మంభశ్శీకరశ్రేణి గాన్.

క॥ శంపాలతాభ బెడిదపు, టంపఱచే ఘోర దానవానీకంబుల్
పెంపఱి సన్నాహంబుల, సొంపఱి భూసుతుని వెనుకఁ జొచ్చెన్
విచ్చెన్.